పత్రికాప్రకటన కాకినాడ, 1.11.2018

భావ కవితా మాధుర్యంతో తెలుగు సాహిత్యానికి క్రొత్త సొబగులు అద్దిన మహాకవి దేవులపల్లి కృష్ణశాస్త్రి అని రాష్ట్ర శాసన సభ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ కొనియాడారు.

గురువారం భావకవితా చక్రవర్తి, కళాప్రపూర్ణ, పద్మభూషన్ దేవులపల్లి కృష్ణశాస్త్రి 122వ జయంతి వేడుకలను ఆయన స్వగ్రామం సామర్లకోట మండలం, చంద్రంపాలెంలో దేవులపల్లి కృష్ణశాస్త్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర శాసన సభ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, ఉపముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, శాసన మండలి ఉపాధ్యక్షులు రెడ్డి సుబ్రమణ్యం, జిల్లా పరిషత్ చైర్మన్ జ్యోతుల నవీన్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరైయ్యారు. తొలుత దేవులపల్లి కృష్ణశాస్త్రి నివసించిన ఇంటి ప్రాంగణంలోని ఆయన విగ్రహానికి అతిథులు పూలమాలలు అలంకరించి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం చంద్రంపాలెం హైస్కూల్ మైదానంలో ఏర్పాటు చేసిన సభాకార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేసి జయంతి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా శాసనసభ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ తన తండ్రి వెంకట కృష్ణారావు, దేవులపల్లి అత్యంత సన్నిహితులని, తద్వారా ఆయన ఆత్మీయను, ఆశీస్సులను పొందే అదృష్టం తనకు లభించిందని మధుర సృతులను నెమరు వేసుసున్నారు. ఎందరో మహానుభావులు తెలుగు భాష ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పి, తెలుగుజాతికి వన్నెతెచ్చారని, అటువంటి వారిలో దేవులపల్లి కృష్ణశాస్త్రి ముందు వరుసలో నిలుస్తారన్నారు. అచ్చమైన తెలుగుతనానికి కృష్ణశాస్త్రి కవిత్వం ప్రతీకని, పల్లె జీవన సౌందర్యాన్ని, సంస్కృతిని ఆయన వ్యాసాలు, పాటలు ప్రతిబింబిస్తాయన్నారు. ఆయన వ్రాసిన ప్రతి వాక్యం రసాత్మకమని, చిన్న గీతం రాసినా అది మహాకావ్య లక్షణ సమన్వితమని శ్లాఘించారు. గాంధీ శత జయంతి సందర్భంగా గాంధీతత్వ సమగ్ర సారాన్ని చిన్నపాటలో అందరికీ తెలియజేశారన్నారు. సాహితీరంగలోనే కాక, హరిజనోద్ధరణ, వేశ్యా వివాహాల వంటి సామాజిక ఉద్యమాలలోకూడా కృషి చేసిన కృష్ణశాస్త్రి జీవితంలోను, కవిత్వంలోను మానవతాదృకృథాన్ని నింపుకున్న మహనీయుడన్నారు. భాషా లాలిత్యం, భావ సౌందర్యంతో తెలుగు సాహిత్యానికి వైభవాన్ని తెచ్చిన దేవులపల్లిని కవిసామ్రాట్ విశ్వనాథసత్యన్నారాయణ ఆంధ్రా టాగూర్ అని, శ్రీశ్రీ చేత ఆంధ్రాషెల్లీ అని కొనియాడరని తెలిపారు. మహనీయుల వల్ల వారు పుట్టిన గడ్డకు ఖ్యాతి వస్తుందని, దేవులపల్లి జన్మించిన చంద్రంపాలెం సాహితీ ప్రపంచానికి ఆత్మీయ గ్రామమన్నారు. ఆయన ఆశయాల బాటలో కృషి చేస్తున్న దేవులపల్లి కృష్ణశాస్త్రి ఛారిటబుల్ ట్రస్ట్‌ను, స్థానిక ఎమ్మెల్యేగా గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న ఉపముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్పను ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర విభజన తర్వార తెలుగు జాతి వైభవం, ఖ్యాతి తెచ్చిన వైతాళికుల జయంతులను రాష్ట్ర పండుగలుగా ప్రభుత్వం నిర్వహిస్తోందని, కందుకూరి వీరేశలింగం, అల్లూరి సీతారామరాజు జయంతుల రీతిలోనే దేవులపల్లి కృష్ణశాస్త్రి జయంతిని కూడా రాష్ట్ర వేడుకగా ప్రకటించేందుకు, ఆయన పేర సాహితీ పురస్కారాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వాన్ని కోరతామన్నారు. అలాగే చంద్రంపాలెంలో ఆయన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు సహకరిస్తామన్నారు. ఆంధ్రుడిగా పుట్టడం, తెలుగు మాట్లాడ గలగడం పూర్వజన్మ సుకృతం వల్లే లభిస్తాయని, ప్రతి తెలుగు బిడ్డ తన భాష, సంస్కృతులను గౌరవించుకుని కాపాడుకోవాలని ఆయన కోరారు.

శశన మండలి ఉపాధ్యక్షులు రెడ్డి సుబ్రమణ్యం మాట్లాడుతూ దేవులపల్లి కృష్ణశాస్త్రి జీవిత విశేషాలు, సాహితీ, సామాజిక రంగాలకు ఆయన అందించిన సేవలను కొనియాడారు. కృష్ణశాస్త్రి జన్మించిన చంద్రంపాలెం తెలుగు వారికి పవిత్ర క్షేత్రమన్నారు. ఉపముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప ప్రసంగిస్తూ కృష్ణశాస్త్రి సృతులను, సాహిత్యాన్ని పరిరక్షించేందుకు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా గ్రామ యువత చేస్తున్న కృషిని అభినందిస్తూ గ్రామాభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తామని తెలిపారు. గ్రామంలో కృష్ణశాస్త్రి స్మారక భవనాన్ని త్వరలోనే చేపడతమని తెలియజేశారు.

కవులు డా.శిఖామణి, సాలిపల్లి మంగామణి, పుష్పాల సూర్యకుమారి దేవులపల్లి సాహిత్యం గొప్పదనాన్ని సభికులకు వివరించారు. జిల్లా పరిషత్ చైర్మన్ జ్యోతుల నవీన్ కుమార్, సోషల్ వర్కర్లు గోకాడ రాంబాబు, ఉంగరాల వెంకటేశ్వరావు ప్రసంగించారు. కార్యక్రమంలో దేవులపల్లి జయంతి పురస్కరించి పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలకు అతిథులు అందజేశారు. బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్న గ్రామ యువకుడు తలారి వెంకట వీర్రాజు దేవులపల్లి చారిటబుల్ ట్రస్ట్‌కు అందజేసిన లక్షల రూపాయల విరాళాన్ని ఆయన తండ్రి భావనానారాయణ మంత్రి చేతుల మీదుగా ట్రస్ట్‌కు అందించారు.

కార్యక్రమంలో బచ్చు ఫౌండేషన్ చైర్మన్ ఎ.కృష్ణ, ప్రెసిడెంట్ తాళ్లూరి ప్రసాద్, దేవులపల్లి ఛారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు పాపారావు, సత్యన్నారాయణ, గ్రామపెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

(సమాచార శాఖచే జారీ)